క్లుప్తంగా

పీహెచ్‌సీ వైద్యులకు మద్దతుగా నిరసన



కాళ్ల పీహెచ్‌సీ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న వైద్య సిబ్బంది

కాళ్ల: తమ న్యాయమైన డిమాండ్లను కూటమి ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు చేపట్టిన సమ్మెకు వైద్య సిబ్బంది మద్దతు తెలుపుతూ నిరసన వ్యక్తం చేశారు. కాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం వైద్య సిబ్బంది నల్ల బ్యాడ్జిలు ధరించుకొని ర్యాలీ చేశారు. ఈసందర్భంగా పలువురు మాట్లాడుతూ జీవో నెంబరు 99ని వెంటనే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ వైద్యులకు న్యాయం చేయాలన్నారు. అనంతరం నల్ల బ్యాడ్జిలతోనే విధులు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ న్యూ విక్టోరిస్ ఎస్‌యూవీ ఆవిష్కరణ



ఆల్ న్యూ విక్టోరిస్ ఎస్‌యూవీ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మారుతీ సుజుకి ఆథరైజ్డ్ డీలర్ నోవల్టీ రెడ్డి అండ్ రెడ్డి మోటార్స్ నందు బుధవారం ఆల్ న్యూ విక్టోరిస్ ఎస్‌యూవీని ఆవిష్కరించారు. సంస్థ ఎండీ రేఖారెడ్డి, రామరెడ్డి మాట్లాడుతూ ఎస్‌యూవీ విక్టోరిస్ కొత్త బెంచ్ మార్కులను సెట్ చేయడానికి రూపొందించబడిన వాహనం అని తెలిపారు. డిజైన్, థ్రిల్లింగ్ పనితీరును కలిగిన ఎస్‌యూవీ పర్యావరణ అనుకూలమైన సీఎన్‌జీలో కూడా అందుబాటులో ఉందన్నారు. మారుతి ప్రతినిధులు నారాయణ్ సింగ్, కపిల్ గుప్త, జనరల్ మేనేజర్ సాయికృష్ణ, కస్టమర్స్ పాల్గొన్నారు.

చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా నూతన కమిటీ



ఏకగ్రీవంగా ఎన్నికైన జిల్లా నూతన కమిటీ

భీమవరం: ఆంధ్రప్రదేశ్ చేతి వృత్తిదారుల సమాఖ్య జిల్లా నూతన కమిటీ ఏకగ్రీవంగా ఎన్నికైంది. కమిటీ గౌరవాధ్యక్షునిగా ఎం సీతారామ్‌ప్రసాద్, అధ్యక్షుడిగా జేగురు శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా పీసీ జోషి, అరట్లకట్ల నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా మల్లుల శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శులుగా కోన గొల్లయ్య, తిరుమాని కామేశ్వరరావు, కోశాధికారిగా నారాయణ, సభ్యులుగా వీరవల్లి శ్రీను, జుత్తిగ మీరయ్య, గూడూరి సత్యనారాయణ, చెల్లబోయిన చంద్రరావు ఎన్నికయ్యారని సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె రామాంజనేయులు బుధవారం తెలిపారు.

కృష్ణంరాజుకు సత్కారం



భీమవరంలో కృష్ణంరాజును సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: సామాజిక సేవకే అంకితమైన కృష్ణంరాజు డాక్టరేట్ అందుకోవడం అభినందనీయమని లయన్స్ క్లబ్ జోనల్ చైర్మన్ నడింపల్లి మహేష్‌కుమార్ వర్మ, కంతేటి వెంకటరాజు అన్నారు. భీమవరంలో బుధవారం అమెరికాలోని బర్లింగ్టన్ స్టేట్ యూనివర్శిటీ డాక్టరేట్ అందుకున్న లయన్స్ ఇంటర్నేషనల్ చైర్ పర్సన్, మాజీ జిల్లా గవర్నర్ చిలుకూరి కృష్ణంరాజును అభినందించి సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ డిల్లీలో ఇండియా హ్యాబిటెట్ సెంటర్లో జరిగిన వేడుకల్లో కృష్ణంరాజు సమాజ సేవా రంగాల్లో చేస్తున్న కృషికిగాను డాక్టరేట్ అందించిందన్నారు.ఈ కార్యక్రమంలో చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

సురక్ష యాప్‌పై అవగాహన



భీమవరం ఎక్సైజ్ స్టేషన్‌లో సురక్షయాప్ అవగాహన కల్పిస్తున్న దృశ్యం

భీమవరం: మద్యం దుకాణాల్లో మద్యం బాటిల్స్‌ను యాప్‌లో స్కాన్‌చేసి మాత్రమే విక్రయాలు చేయాలని భీమవరం ఎక్సైజ్ సీఐ కె బలరామరాజు అన్నారు. భీమవరం ఎక్సైజ్‌స్టేషన్‌లో బుధవారం మద్యంషాపులు, బార్లలో పనిచేసే సిబ్బందికి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్ వాడకంపై అవగాహన కల్పించారు. మద్యం షాపుల్లో ఎంఆర్‌పీ ధరలకే విక్రయాలు చేయాలని బెల్ట్‌షాపులు నిర్వహిస్తే సమాచారం ఇవ్వాలన్నారు. ఎస్‌ఐలు పీవీవీఎస్ ఉమామహేశ్వరరావు, పి సునీల్ కుమార్ పాల్గొన్నారు.

మీ సంతకం.. మీ పిల్లల భవిష్యత్‌కు బాట వేస్తుంది

- మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ
- చినకాపవరంలో రచ్చబండలో పీవీఎల్ నర్సింహరాజు వెల్లడి



ఆకివీడు: చినకాపవరం రచ్చబండలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్



ఉండిలో సంతకాల సేకరణ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: మీ సంతకం, మీ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాటు వేస్తుందని, కోటి సంతకాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కాలవాలని వైఎస్సార్ సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్.నర్సింహరాజు పిలుపునిచ్చారు. మండలంలోని చినకాపవరం గ్రామంలోని జెడ్పీటీసీ వేగేశ్న వెంకట్రాజు(యండగండి శ్రీను) నివాసంలో బుధవారం రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నర్సింహరాజు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 17 మెడికల్ కళాశాలల్ని ఏర్పాటు చేశారన్నారు. పలు కళాశాలలు నడుస్తున్నాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మెడికల్ కళాశాలల్ని ప్రైవేట్ పరం చేసేందుకు సీఎం చంద్రబాబు, కూటమి కుట్రలు పన్నుతోందన్నారు. ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేయడం ద్వారా లక్షల కోట్లు ఆదాయం పొంది, పేద, మధ్యతరగతి ప్రజల విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల్ని రక్షించుకుంటేనే భవిష్యత్‌లో పేదవాడి పిల్లవాడు డాక్టర వుతాడన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. కళాశాలల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని విజయవంతం చేసి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు నంద్యాల సీతారామయ్య, ఎంపీపీ కఠారి జయలక్ష్మీ కేశవరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పార్టీ గ్రామ కమిటీల అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కోటి సంతకాల సేకరణ పేపర్లను నాయకులకు నర్సింహరాజు పంపిణీ చేశారు.

వైద్య కళాశాల ప్రైవేటీకరణపై పోరాటం ఆగదు

ఉండి: పేదవాళ్లు అభివృద్ధి చెందడం కూటమి ప్రభుత్వానికి అస్సలు గిట్టదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పీవీఎల్ నర్సింహరాజు తీవ్రస్థాయిలో మండిపడ్డారు. మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కోటిసంతకాల కార్యక్రమాన్ని బుధవారం పార్టీ మండలాధ్యక్షుడు పీవీ ఆర్‌కే ఆంజనేయరాజు, ఉండి పట్టణాధ్యక్షుడు కరిమెరక మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా ఉండి పెదపేటలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సమావేశంలో పీవీఎల్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఒకే ఏడాది 17 మెడికల్ కళాశాలను ప్రారంభించిన గొప్ప చరిత్ర నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజల ఆరోగ్య పరిరక్షణ నిమిత్తం మెడికల్ కాలేజీలు, దానిలో పెద్ద పెద్ద ఆసుపత్రులు ఏర్పాటు చేయడం ద్వారా రాష్ట్ర ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో జీవించాలనే ఒకేసారి 17 మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. వీటిలో కొన్ని కాలేజీలలో తరగతులు ప్రారంభిస్తే మరికొన్ని ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. అటువంటి గొప్ప కార్యక్రమాన్ని కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రైవేటు వ్యక్తులు చేతుల్లో పెట్టి ప్రజారోగ్యాన్ని గాలికొదిలేస్తున్నారని మండిపడ్డారు. చంద్రబాబు గతంలోను, ఇప్పుడు కూడా పరిపాలనలో ఒక్క మెడికల్ కాలేజ్‌ను కూడా తీసుకురాకపోగా జగన్‌మోహన్ రెడ్డి తెచ్చిన మెడికల్ కాలేజ్‌లను అమ్మకానిని పెట్టడం సిగ్గు చేటని అన్నారు. ఇటువంటి దుర్మార్గపు పనిని అడ్డుకునేందుకు రాజకీయాలకు అతీతంగా జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలంతా ఏకంకావాలని ఆయన పిలుపునిచ్చారు. నమ్మి ఓట్లు వేసిన ప్రజలను నట్టేటముంచడం చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య పేర్కొన్నారు. నిరుపేద విద్యార్థులు డాక్టర్‌లు కావాలనే కలను నెరవేర్చేందుకు జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కాలేజీలు తీసుకువస్తే కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో చంద్రబాబు మెడికల్ కాలేజ్‌లను అమ్మకానికి పెట్టి నిరుపేద విద్యార్థుల కలలను చెదరగొడుతున్నారన్నారు. అందుకే ప్రజలంతా ఏకమై నిరసన తెలపాలని, సంతకాలు సేకరించి వాటిని రాష్ట్ర గవర్నర్‌కు పంపించి చంద్రబాబు దుష్టపన్నాగాన్ని అడ్డుకోవాలని పీవీఎల్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి, మాజీ రాష్ట్ర డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, చిట్టూరి రత్నరాజు, గులిపల్లి అచ్చారావు, బడుగు బాలాజీ, వైఎస్ ఎంపీపీ గుత్తుల కనకదుర్గరామకృష్ణ, ఎంపీటీసీ గిరడ శ్రీను, రాయి శ్రీను, ఆర్‌కే, అడబాల నాని, వీరమల్లు మల్లేశ్వరరావు, గెద్దా భోగేశ్వరరావు, కోరసీక కుమార్, చిట్టూరి జార్జ్, ఆనందరావు, సనపల విష్ణు, గొట్టుముక్కల వెంకటకృష్ణంరాజు, పొత్తూరి సత్యనారాయణరాజు, ముదునూరి అప్పలరాజు, వేగేశ్న సూర్యనారాయణరాజు, వాల్టర్‌లాల్, మహేష్, గెద్దా రవి, రాజేష్, మెట్ట అప్పారావు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



భీమవరం తిరుమల కళాశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ నాగరాణి

భీమవరం: బాలికలు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేస్తే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునని కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బుధవారం భీమవరం తిరుమల కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. యువత సోషల్ మీడియాకు బానిసకావడంతో చదువుపై ఏకాగ్రత తగ్గి చదువులో వెనుకబడుతున్నారనిన ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం అంతర్జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా వివిధ అంశాలపై నిర్వహించిన పోటీలలో విజేతలకు కలెక్టర్ నాగరాణి చేతుల మీదుగా బహుమతులను అందచేశారు. జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖాధికారిణి డి శ్రీలక్ష్మి, జిల్లా విద్యాశాఖ అధికారి ఇ నారాయణ, ఏపీసీ పి శ్యాంసుందర్, డిఎంహెచ్‌ఓ జి గీతాబాయి, డిస్ట్రిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి ఆర్ రాజేష్, డిఐఈఓ జి ప్రభాకరరావు, తిరుమల కళాశాల డైరెక్టర్లు పి శ్రీనివాస వర్మ, ఎస్ సాయిరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని విజయోత్సవ సభకు వ్యాపారవేత్తలు



భీమవరంలో బస్సును జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి

భీమవరం (ప్రకాశంచౌక్): సూపర్ జీఎస్టీ – సూపర్ సేవింగ్స్ విజయోత్సవ సభకు దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హాజరు కానున్నందున ఈ సభకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం నుంచి బయలుదేరిన వీఐపీలు, వ్యాపారవేత్తలు, ఎంఎంఎస్‌ఎంఇలు, టాక్స్ పేయర్స్ బుధవారం సాయంత్రం భీమవరం కొత్త బస్టాండ్ నుంచి బయలుదేరి వెళ్తున్న ఆర్టీసీ బస్సును జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. ఆయన విజయోత్సవ సభకు వెళ్లే ప్రముఖులకు అభినందనలు తెలిపారు. కర్నూలులో జరిగే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ విజయోత్సవ సభకు పశ్చిమగోదావరి జిల్లా భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు నుంచి 400 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. వాణిజ్య పన్నుల శాఖ డిప్యూటీ కమిషనర్ కె.పి.శైలజ, ఆర్డీవో కె.ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా జీఎస్టీ అధికారి కేతేశ్వరరావు, జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యు.మంగపతి రావు, మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డి, అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్ ఎ.రాంబాబు, పులకండ కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలకు మరమ్మతులు



జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన కేంద్ర సీసీ కెమెరాలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

ఆకివీడు: జాతీయ రహదారిపై గతంలో ఏర్పాటు చేసిన కేంద్ర సీసీ కెమెరాలకు ఎట్టకేలకు మరమ్మతులు చేపట్టారు. గత కొంత కాలంగా సీసీ కెమెరాలు పని చేయడం లేదు. నిరుపయోగంగా ఉన్నాయి. ప్రధాన రహదారిపై జరిగే ప్రమాదాలు, అనుమానస్పద వ్యక్తుల సంచారం వంటి సమాచారం పోలీసులకు అందడం లేదు. వీటి సీసీ ఫుటేజ్ ఆపరేషన్ కూడా రాష్ట్ర రాజధానిలోని కేంద్ర కార్యాలయంలో ఉన్నట్లు పోలీసులు చెబుతున్నారు. జాతీయరహదారి వెంబడి వీటిని అమర్చారు. చాలా ప్రాంతాల్లో నిరుపయోగంగా ఉన్న వాటికి మరమ్మతులు చేసి, అమర్చడం వల్ల రోడ్డుపై జరిగే అకృత్యాలకు కళ్లెం వేయవచ్చు అంటున్నారు స్థానికులు.

ఈ రహదారికి మోక్షమెప్పుడో!



విస్సాకోడేరులోని సీడీపీఓ కార్యాలయానికి వెళ్లే రహదారి

పాలకోడేరు: పాలకోడేరు మండలం విస్సాకోడేరు గ్రామంలో ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సీడీపీఓ కార్యాలయానికి వెళ్లే రహదారి అధ్వాన్న స్థితిలో ఉంది. ఈ కార్యాలయం జిల్లా కేంద్రమైన భీమవరంకు కూతవేటు దూరంలో ఉండడం గమనార్హం. ఈ కార్యాలయం వీరవాసరం భీమవరం పట్టణం, భీమవరం మండలాల ప్రజలకు సేవలు అందిస్తుంది. ఈ రహదారి 165 జాతీయ రహదారికి 100 మీటర్ల దూరంలో ఉంది. చిన్నపాటి వర్షం వచ్చినా కార్యాలయానికి వెళ్లే రహదారి చిత్తడిగా మారుతుంది. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి ఈ రహదారికి మోక్షం కలిగించాలని కోరుతున్నారు.

ఆభరణాల చోరీ

ఉండి: గుర్తు తెలియని వ్యక్తులు తన బంగారు ఆభరణాలు చోరీ చేశారని మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉండి మండలం పాములపర్రు గ్రామ శివారు కొండగూడెం ప్రాంతానికి చెందిన బోణం రామలక్ష్మీ అనే మహిళ ఈ ఏడాది ఆగస్టు 7వ తేదీన బంధువుల ఇంట ఫంక్షన్‌కు వెళ్లి వచ్చి తన బంగారు ఆభరణాలు 3 కాసుల తాడు, అరకాసు సూత్రం బీరువాలో పెట్టింది. వాటిని గతనెల 7వ తేదీన తెలిసిన వారి ఇంట్లో ఫంక్షన్ కొరకు వేసుకుందామని బీరువా తెరిచి చూడగా వస్తువులు కనిపించలేదు. దీంతో గుర్తు తెలియని వారు తన బంగారు ఆభరణాలు చోరీ చేసినట్లు ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు ఏఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు



భీమవరం పట్టణంలో వైఎస్సార్‌సీపీ కోటి సంతకాల కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయకర్త వెంకటరాయుడు తదితరులు

భీమవరం: కోటి సంతకాలతో కూటమి కోటలకు బీటలు వారడం ఖాయమని, మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పెల్లుబిక్కుతున్న ప్రజాగ్రహ జ్వాలల్లో దగ్ధమవడం తథ్యమని వైఎస్సార్ సీపీ భీమవరం నియోజకవర్గ సమన్వయకర్త చినమిల్లి వెంకటరాయుడు అన్నారు. బుధవారం భీమవరం పట్టణంలోని 1, 2, 3 వార్డులో మెడికల్ కళాశాలలను ప్రైవేట్‌పరం చేయడాన్ని నిరసిస్తూ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో చేపట్టిన కోటి సంతకాల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండగా పేదలకు సైతం కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వం ఉచితంగా విద్యనందించడానికి మనబడి నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను సుందరంగా తీర్చిదిద్ది విద్యార్థులకు సకల సౌకర్యాలు కల్పిస్తే నేటి కూటమి ప్రభుత్వం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో చేపట్టిన ప్రభుత్వ మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాడానికి పూనుకోవడంతో కూటమి నాయకులకు పేదల పట్ల ఉన్న శ్రద్ధ అవగతమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర మహిళా విభాగం కార్యదర్శి పాలవెల్లి మంగ, పట్టణ అధ్యక్షుడు గాదిరాజు రామరాజు, పార్టీ జిల్లా యువజన విభాగం కన్వీనర్ చిగురుపాటి సందీప్, పార్టీ నాయకులు ఇంటి సత్యనారాయణ, రాయవరపు శ్రీనివాసరావు, గుంటి ప్రభు, తాళ సంతోష్, నక్కా అశోక్‌బాబు, పైపూరి సూరిబాబు, పేటేటి ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ఇలా అయితే విద్యార్థుల ఆరోగ్యం ఎలా?





ఉండి జడ్పీ హైస్కూల్ ఎదుట సీసీరోడ్డుపై నిలిచిన వర్షపు నీటి మడుగు, లోపల ఆవరణ

పాఠశాల ఎదుట వర్షం నీరు నిలిచి పోయిన వైనం

ఉండి: ఇలా అయితే విద్యార్థుల ఆరోగ్యం ఏంగాను అంటూ తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు నియోజకవర్గ కేంద్రం ఉండిలోని పలు ప్రాంతాలు నీటమునిగాయి. అయితే డ్రెయినేజ్ వ్యవస్థను మెరుగుపరచడంతో నీరంతా బయటకు వెళ్లిపోయింది. అయితే లోతట్టు ప్రాంతం అయిన ఉండి జెడ్పీ హైస్కూల్ రోడ్డులో మాత్రం వర్షపు నీరు రోజుల తరబడి నిలిచి ఉంది. వందలాది మంది హైస్కూల్ విద్యార్థులు, ఉండి పెదపేటకు చెందిన ప్రజలు ఈ దారిలోనే వెళ్లాల్సి ఉండటంతో నీరు దుర్గంధంతో నిండిపోయింది. బుధవారం ఉదయం స్కూల్‌కు వచ్చిన కొందరు విద్యార్థులు ఈ నీటిలో పడిపోవంతో స్కూల్‌కు యూనిఫాం, పుస్తకాలు తడిసిపోవడంతో స్కూల్ మానివేసి తిరిగి ఇంటిముఖం పట్టారు. అలాగే నీటిలో నడిచి వెళ్తున్న పలువురు విద్యార్థుల కాళ్లకు దురదలు వస్తున్నాయని స్థానిక విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అయితే ఈ నీటిని తరలించేలా అధికారులు చర్యలు తీసుకోకపోగా, ఉపాధ్యాయులు కూడా పట్టించుకపోవడం గమనార్హం. అంతే కాకుండా జెడ్పీ హైస్కూల్ ఆవరణలో నీరు కూడా రోజుల తరబడి నిలిచి ఉండటంతో దానిలోని గడ్డి కుళ్లి దుర్వాసన రావడంతో విద్యార్థులు చదవుపై ఏకాగ్రత చూపలేకపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు వెంటనే చర్యలు తీసుకుని విద్యార్థుల ఆరోగ్యానికి, చదువులకు ఎటువంటి భంగం కలుగకుండా చూడాలని పలువురు కోరుకుంటున్నారు.

కలాం చిరస్మరణీయుడు

ఆకివీడు: మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చిరస్మరణీయుడని ఏఎంసీ మాజీ చైర్మన్ వానపల్లి బాబూరావు అన్నారు. స్థానిక ఏపీజే అబ్దుల్ కలాం ట్రస్టు ఆధ్వర్యంలో ఆయన జయంతి సందర్భంగా బుధవారం స్థానిక రైస్‌మిల్లర్స్ భవనంలో సేవా కార్యక్రమాల్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ యువత కలాంను ఆదర్శంగా తీసుకుని దేశానికి సేవలందించాలన్నారు. ఉచిత మెడికల్, డెంటల్, కంటి వైద్య శిబిరాలు నిర్వహించారు. యువత రక్తదానం చేశారు. శిబిరంలో 221 మంది వైద్య సేవలు పొందారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు నడిపూడి వెంకట రమణ, మజ్జి శ్రీను, స్థానికులు పాల్గొన్నారు.

కలాంను స్ఫూర్తిగా తీసుకోవాలి



భీమవరంలో అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

భీమవరం: భారతదేశ మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని భీమవరం పట్టణంలోని కస్తూరిబాభవనంలో మానవతా సంస్థ, సర్వోదయ మండలి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ముందుగా అబ్దుల్ కలాం చిత్రపటానికి మానవతా సంస్థ అధ్యక్షుడు చింతలపాటి రామకృష్ణంరాజు, సర్వోదయ మండలి కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ అబ్దుల్‌కలాం అతి పేద కుటుంబంలో జన్మించినా కష్టపడి ఉన్నత చదువులు చదివి అణు పరిశోధన శాస్త్రవేత్తగా విశిష్ట పరిశోధనలు చేసి, పుస్తకాలు రచన చేశారన్నారు. భారతదేశ రాష్ట్రపతిగా అత్యున్నత సేవలు అందించి భారతరత్న అందుకున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కలిగొట్ల గోపాలశర్మ, అల్లు శ్రీనివాస్, కారుమూరి నర్సింహమూర్తిబాబు, గ్రంథి కుమార వెంకటేశ్వర వరప్రసాద్, ఇందుకూరి శివాజీ వర్మ, ఎస్‌కే చాన్ బాషా, సీతారామరాజు, అరవ భాస్కరరావు, దుర్గాదేవి, సంతోషి తదితరులు పాల్గొన్నారు.